# చూసిన కనులదే భాగ్యమట..

- ఉత్తర ద్వారంలో వైకుంఠనాథుని దర్శనం
- వెంకన్న ఆలయాలకు పోటెత్తిన జనం
- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పర్వదినం


ప్రత్యేక అలంకరణలో ఎంబర్ మన్నార్ స్వామి

అల్లిపురం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని నియోజకవర్గవాసులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్వామి ఉత్తర ద్వార దర్శనం కోసం వైష్ణవ ఆలయాలకు వేకువ జాము నుంచి భక్తులు పోటెత్తారు. స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామస్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి. అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.


కల్యాణ మండపంలో పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

- బల్లిగిరి వేంకటేశ్వరస్వామి సన్నిధిలో తెల్లవారుజామున 4 గంటల నుంచే సందడి మొదలైంది. వజ్రకవచ ధారిగా వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో స్వామిని విశేషంగా అలంకరించారు. దేవాలయ ప్రాంగణాన్ని పూలమాలికలతో, మామిడి తోరణాలతో తీర్చిదిద్దారు. ఆలయ మండపంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ కల్యాణమండపంలో కొలువుదీర్చి, భక్తుల గోత్రనామాలతో పూజలు చేయించారు. అంతకు ముందు ఉత్సవ విగ్రహాలతో కూడిన పల్లకీని ఆలయ పరిక్రమణ మేళతాళాల మధ్య ఊరేగించారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేపట్టినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.పద్మావతి తెలిపారు. ప్రైవేటు సంస్థలు భక్తులకు క్యాలెండర్లు, ప్రసాదాలు పంపిణీ చేశాయి.


ప్రత్యేక అలంకరణలో రాంరాం మందిరంలోని సీతారామచంద్రస్వామి

- అలిమేలు మంగమ్మ ఆలయంలో అలిమేలు మంగమ్మను, గోదాదేవిని విశేషంగా అలంకరించి ఆలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనాలు కల్పించారు.
- గోవింద్ రోడ్డులోని రాంరాం మందిరంలో శ్రీ సీతారామలక్ష్మణ స్వాములను విశేషంగా అలంకరించి, పూజలు చేశారు. ఏకాహం చేపట్టారు. భక్తులకు అన్నసమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు.

### అంబికాబాగ్ రామాలయంలో..

దాబాగార్డెన్స్: మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తరద్వారం నుంచి స్వామి దర్శనాలు ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున 5.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్వామి దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, కార్యనిర్వాహక ఇంజినీర్ సీహెచ్‌వీ రమణ, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


అంబికాబాగ్ రామాలయంలో తెల్లవారుజామున స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

### సత్యదేవుని ఆలయంలో..

ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకున్నారు. ఏకాదశిని పురస్కరించుకుని వ్రతాలు నిర్వహించారు. ఉచితంగా ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 31వ వార్డు పరిధి గొల్లలపాలెం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఉమారామలింగేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం కావడంతో శివాలయంతో పాటు సీతారామచంద్రస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో తుంబుర హరిహర నామ సంకీర్తన మిత్రమండలి భజన కార్యక్రమం నిర్వహించారు.

### సామూహిక సత్యనారాయణ వ్రతాలు

అల్లిపురం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా వివేకానంద కాలనీలోని షిర్డీ మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు విశేష పూజలు చేశారు.


విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి


వివేకానంద కాలనీలో సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు


అంబికాబాగ్ రామాలయంలో పూజలు చేస్తున్న ఆలయ ఈవో శిరీష తదితరులు


బల్లిగిరి వెంకన్న ఆలయ మండపంలో పూజలు చేస్తున్న భక్తులు


చెంగల్రావుపేటలోని ఎంబర్‌మన్నార్ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

## క్లుప్తంగా

### నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

### పట్టా ఫౌండేషన్ మహా ప్రసాద వితరణ


ప్రసాదం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు


దాబాగార్డెన్స్: నగరంలోని పలు దేవాలయాల్లో పట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహా ప్రసాద వితరణ చేపట్టారు. రుషికొండలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం, విశాలాక్షి నగర్‌లోని భక్త తుకారామాలయం, చినవాల్తేర్‌లోని జగన్నాథ స్వామి ఆలయం, భానోజీనగర్‌లోని శ్రీరామసాయి మందిరంతో పాటు ప్రముఖ వైష్ణవ దేవాలయాల్లో ప్రసాదంతో పాటు భక్తులకు గోవింద నామావళి పుస్తకాలు అందజేశారు. పట్టా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టా రమేష్‌బాబు మాట్లాడుతూ మళ్ల మాధవ్ కామాక్షి, మోటూరు ప్రకాష్ పార్వతి సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### మర్యాదపూర్వక కలయిక


పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ రామ్మోహన్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొర్లె చందు

కంచరపాలెం: నేషనల్ పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి గొర్లె చందు సోమవారం పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ కె.రామ్మోహన్‌రావును పోర్ట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.గురుప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటరావు, అప్పారావు, అప్పలనాయుడు, శాంతి, బి.కె.సత్యనారాయణ, ఎస్‌కేరాజు, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే వాసుపల్లికి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే గణేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రంధి గోపి, విజయలక్ష్మి

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు సోమవారం పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపి, పార్టీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, శ్రీనివాస రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు, వార్డు మహిళా అధ్యక్షురాలు వై.చిన్నమ్మలు, ఆడారి వెంకట మహేష్, కణితి బ్రహ్మం, శ్రీను తదితరులు ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే వారికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రెట్టించిన ఉత్సాహంతో పార్టీని బలోపేతం చేయాలని కోరారు.



## కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు అభినందనలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌కు ఆర్‌ఎంపీ రాష్ట్ర ఫెడరేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు. ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా కార్యదర్శి ఆనందరావు, గౌరవ సలహాదారుడు బాల సుందరం, మహిళా కార్యదర్శులు సూర్యకళ, అన్నపూర్ణ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానం చేశారు. అలాగే ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఎం అండ్ హెచ్‌వోకు జగదీశ్వరరావుకు ఆర్‌ఎంపీ రాష్ట్ర ఫెడరేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.


కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌ఎంపీ రాష్ట్ర ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనందరావు తదితరులు

## ఆశా కార్యకర్తల్లో సేవా భావం అవసరం

ఆరిలోవ: ఆశా కార్యకర్తలు సేవా భావంతో పని చేయాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పైనాపిల్ కాలనీ దరి జిల్లా మహిళా ప్రాంగణంలో ఆశా కార్యకర్తలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజన ప్రాంతాల ఆశా కార్యకర్తలకు ఇక్కడ 10 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఆశా కార్యకర్తల వైద్య సేవలు ప్రజలకు ఎంతో అవసరమన్నారు. ఇక్కడ శిక్షణ ద్వారా పొందిన అంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో మాతా శిశు సంక్షేమ శాఖ వైద్య సేవలపై పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి నెలా 9న నిర్వహిస్తున్న పీఎంఎస్‌ఎంఏ ప్రోగ్రాంలో భాగంగా గర్భిణులకు పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమలాకుమారి, డాక్టర్ బి.ఉమావతి, డీపీహెచ్‌ఎన్‌వో సత్యవతి, హెచ్‌ఈఈవో మణికుమారి, డీసీఎం లక్ష్మి, హెచ్‌ఈ నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.


మహిళా ప్రాంగణం సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

## భక్తిశ్రద్ధలతో గిరి పరిక్రమణ

అల్లిపురం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్నమయ్య భక్తి మంజరి సభ్యులు సోమవారం తెల్లవారుజామున బల్లిగిరి పరిక్రమణ భక్తిశ్రద్ధలతో చేపట్టారు. తొలుత బల్లిగిరి వెంకన్న పాదాల వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం దేవుని పటాలు, దీపాలు చేతపట్టి భక్తి పాటలు పాడుతూ సింహాలదేవిడి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, బీఆర్ రెడ్డి జంక్షన్, సౌత్ జైలురోడ్డు, నీలమ్మ వేపచెట్టు మీదుగా జ్యోతి థియేటర్, కెప్టెన్ రామారావు జంక్షన్ మీదుగా తిరిగి సింహాలదేవిడి చేరుకుని బల్లిగిరి దేవుని పాదాల చెంతకు చేరుకుని విరమించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య భక్తి మంజరి సభ్యులు శరగడ సూకరాజు, జి.రామారావు, జి.మానస, వెంకటలక్ష్మి, బుద్ధ లీలావతి, సునీత, గీత, సత్యవతి, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.


గిరి పరిక్రమణ చేపడుతున్న అన్నమయ్య భక్తి మంజరి సభ్యులు

## వైభవంగా మహా సన్నిధాన పూజ


సన్నిధాన పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

అల్లిపురం: శ్రీధర్మశాస్త తత్వమసి, అయ్యప్ప భక్త బృందం సంయుక్త ఆధ్వర్యంలో మహా సన్నిధాన పూజా కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. సోమవారం వన్‌టౌన్ హాల్ వద్ద జరిగిన కార్యక్రమంలో తొలుత గణపతి పూజ, శ్రీలక్ష్మీదేవి పూజ, అయ్యప్పస్వామి పూజ, వేంకటేశ్వరస్వామి పూజ చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీను గురుస్వామి, అర్చకుడు సంపత్ కుమార్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. చక్రవర్తి గురుస్వామి బృందం అయ్యప్పస్వామి భక్తి గీతాలాపన అలరించింది. శ్రీను గురుస్వామి 38 సార్లు, చక్రవర్తి గురుస్వామి 36 సార్లు శబరిమల అయ్యప్పస్వామిని దర్శించుకున్న సందర్భంగా వారికి సత్యనారాయణ, రవి స్వామి సత్కరించారు.


అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

## సమాచారమ్

### నేడు ప్రజా దర్బార్

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ పరిధిలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు దొండపర్తి పరదేశమ్మ గుడి వద్ద 27, 41, 42 వార్డులకు, ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుల సమస్యలపై, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లక్ష్మీ టాకీస్ బస్టాప్ వద్ద 29, 30, 31, 35 నుంచి 39వ వార్డులకు సంబంధించి ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ఆయా వార్డుల ప్రజలు తమ ప్రాంతాల్లోని సమస్యలను విన్నవించుకోవచ్చు.

### ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి


భక్తి గీతాలు ఆలపిస్తున్న బృందం

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం అన్నమయ్య భక్తిమంజరి సభ్యుల సంగీత విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సరగడ సూకరాజు, దుర్గా ప్రసాద్ పండా పాడిన అన్నమయ్య కృతులు అలరించాయి. కళాకారులను ఈవో కె.పద్మావతి, అర్చకుడు రాఘవాచార్యులు సత్కరించారు.

### ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం


కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

దాబాగార్డెన్స్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం లలిత శ్రీనివాస్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం భక్తులు పాల్గొన్నారు.

### ఏబీ బర్దన్‌కు ఘన నివాళి

అల్లిపురం: దివంగత సీపీఐ నేత ఏబీ బర్దన్ 7వ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో నగర కార్యదర్శి మరుపల్లి పైడిరాజు అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో సీపీఐ నేతలు ఎస్.కె.రెహ్మాన్, ఎం.మన్మథరావు, ఎ.ఆదినారాయణ, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొని బర్దన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.


ఏబీ బర్దన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

### పింఛన్ అందజేత


పద్మానగర్‌లో సచివాలయం కన్వీనర్ కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో సన్యాసినాయుడికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ కృష్ణ సాయి

## జోన్-4 'స్పందన'కు 4 వినతులు

జగదాంబ: జోన్-4 కార్యాలయంలో జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 4 వినతులు వచ్చాయి. ఇందులో యూసీడీ విభాగానికి సంబంధించినవి 2, రెవెన్యూకు సంబంధించి 1, ఇతర విభాగాలకు సంబంధించినది ఒకటి ఉన్నట్లు జెడ్సీ తెలిపారు. వాటిని సంబంధిత విభాగాలకు పంపించిన జెడ్సీ, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ చక్రవర్తి

## బీసీ జనగణన చేపట్టాలని వినతి

అల్లిపురం: బీసీ జన గణన జరిగేలా కేంద్రప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ ఏపీ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం సభ్యులు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుకు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఆయన్ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ ప్రైవేట్ ఉద్యోగ అవకాశాల్లోనూ రిజర్వేషన్ కల్పించడం, బీసీలకు క్రీమిలేయర్ తొలగించడం తదితర అంశాలపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ బీసీ జన గణన అనేది రాష్ట్రాల వారీగా జరిగితే త్వరితగతిన పూర్తవుతుందన్నారు. బీసీ కమిషన్ చైర్మన్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో సంఘం సభ్యులు కోటా రమేష్, కె.రామ్‌కుమార్, కొయ్య రామకృష్ణ, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎల్లారావు, సీనియర్ బీసీ సంఘం నాయకుడు కర్రి రాము తదితరులున్నారు.


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

## కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అల్లిపురం: గత నెల డిసెంబర్ 31వ తేదీ రాత్రి డీఆర్‌ఎం కార్యాలయం వద్ద కారు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. టూటౌన్ సీఐ తిరుమల రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయి. చామన ఛాయ కలిగి, నలుపు, తెలుపు గెడ్డంతో ఉన్నాడని, ఎరుపు రంగు స్వెట్టర్, బూడిద రంగు హాఫ్ హ్యాండ్స్ టీ షర్టు, సిమెంట్ రంగు ప్యాంటు ధరించాడని సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 04716, 94407 40864 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం